

హామీలు నెరవేరుస్తా : ఎంపీ మహేష్

ఏలూరు సిటీ : తాను ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా నెరవేరుస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఏలూరు ఎంపీగా గెలిచి ప్రమాణస్వీకారం తర్వాత మొదటిసారిగా మంగళవారం ఏలూరు వచ్చిన పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక సత్రంపాడులోని అంబికా దేవి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఫైర్‌స్టేషన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ మాట్లాడుతూ తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఏలూరులో వందే భారత్ రైలు ఆగేలా చూస్తానన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని, యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పించేందుకు సెప్టెంబర్ నుంచి ప్రతి వారం ఎంపీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 340 రెజ్యూమ్‌లు వచ్చాయని, వారందరికీ ఉద్యోగం వచ్చేలా చూస్తానని చెప్పారు.

ఉచితమే.. అ'ధర'హో..!

- ఉచిత ఇసుక విధానంపై జనాల్లో తీవ్ర చర్చ
- ఏలూరు జిల్లాలో మూడు స్టాక్‌పాయింట్ల నుంచి ఇసుక సరఫరా
- చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో టన్ను ఇసుక రూ.538
- విజరం, ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్లలో ధర తగ్గినా రవాణా ఛార్జీల మోత
- గతానికి.. ఇప్పటికీ ధరలో పెద్దగా తేడా లేదంటూ అంతా పెదవి విరుపు
- పశ్చిమలో ఇసుక నిల్వలు లేకపోవడంతో తూర్పు, కోనసీమ జిల్లా నుంచే దిక్కు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇసుక ఉచితమే.. ధర అధరహో అన్నట్లు ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ విధానం ఉండడంతో జనాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతానికి ఇప్పటికీ ధరలో పెద్దగా తేడా లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానం జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామంటూ టిడిపి కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా కమిటీలను సైతం నియమించింది. ప్రస్తుతం స్టాక్‌పాయింట్లలో ఉన్న ఇసుకను ఉచితంగా అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో అమల్లోకి వచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని పరిశీలిస్తే ప్రజలకు పెద్దగా ప్రయోజనంలేని విధంగా ఉందన్న చర్చ నడుస్తోంది. ఏలూరు జిల్లాలో ఓపెన్ ఇసుక రీచ్‌లో లేవు. దీంతో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలం విజరం, ఇబ్రహీంపేటలో ఉన్న మూడు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా చేయాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. చేబ్రోలు స్టాక్ పాయింట్‌లో పెద్దగా ఇసుక నిల్వలు లేవని తేలిపోయింది. ఉన్న ఇసుక సైతం నాణ్యత లేనిదిగా ఉంది. విజరంలో ఇసుక డిపో వద్ద 1500 టన్నులు, ఇబ్రహీంపేట డిపో వద్ద 75 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తేల్చారు. ఈ పాయింట్ల నుంచి ఇసుక సరఫరాకు సంబంధించి ధరలను కమిటీ నిర్ణయించింది. ఎగుమతి ఖర్చు, ఇసుక డిపోకు చేరవేత వంటి ఖర్చుల ఆధారంగా ఈ ధర నిర్ణయించినట్లు చెబుతున్నారు. చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర రూ.538గా, విజరం స్టాక్‌పాయింట్ వద్ద రూ.362, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక రూ.210 ధర నిర్ణయించి బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఇసుక సరఫరా చేయబడునని బోర్డులపై పేర్కొన్నారు. ఒక్క రోజులో ఒక వ్యక్తికి 20 టన్నుల ఇసుక మాత్రమే తీసుకోవడానికి అనుమతి అని నిబంధనలు విధించారు. ఇసుక టన్నుకు నిర్ణయించిన ధరలు చూసి జనం విస్తుపోతున్న పరిస్థితి నెలకొంది. చేబ్రోలు డిపో నుంచి గతంలో టన్ను ఇసుక ధర రూ.750 వసూలు చేసేశారు. రవాణా ఛార్జీలతో కలుపుకుంటే 20 టన్నులు కలిగిన ఆరు యూనిట్ల లారీ ఇసుక ధర రూ.18 వేల వరకూ ఉండేది. ఇప్పుడు రూ.538 ధర నిర్ణయించడంతో రవాణా ఛార్జీలతో కలిపి రూ.15 వేలకు పైగా ఖర్చవుతోంది. ఉచిత ఇసుక అని చెబుతున్నా ధరలో పెద్దగా తేడా కనిపించడం లేదు. విజరం, ఇబ్రహీంపేట డిపోల వద్ద టన్ను ఇసుక ధర తక్కువగా ఉన్నప్పటికీ అక్కడ నుంచి ఏలూరు జిల్లాలో ఏ గ్రామానికి తీసుకెళ్లాలన్న వంద కిలోమీటర్లకుపైగా దూరం ఉంది. దీంతో రవాణా ఛార్జీలు తడిసి మోపెడవనున్నాయి. ఉచిత ఇసుక విధానం అని చెబుతున్నప్పటికీ భారీగా సొమ్ములు చెల్లించాల్సి రావడంతో జనం పెదవి విరుస్తున్నారు. ముందు ముందు ధరలు పెంచితే ఉచిత ఇసుక విధానంతో జనానికి పెద్దగా ప్రయోజనం ఉండదని స్పష్టమవుతోంది.


ఉంగుటూరు మండలం చేబ్రోలు ఇసుక డిపో

'పశ్చిమ'లో పరిస్థితి మరింత దారుణం

ఉచిత ఇసుక విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలైనా 'పశ్చిమ'లో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. ఈ జిల్లాలోని ఆచంట మండలంలో కోడేరు, కరుగోరుమిల్లి, పెనుగొండ మండలంలో సిద్ధాంతంలో రెండు, నడిపూడిలో రెండు మొత్తం ఆరు ఓపెన్ ఇసుక రీచ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ మూతపడ్డాయి. అనుమతులు వచ్చే వరకూ ఇవి తెరుచుకునే అవకాశం లేదు. నరసాపురం, యలమంచిలిలో ఐదు డి-సిల్టేషన్ పాయింట్లు ఉన్నప్పటికీ అవి ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో జిల్లాలో ఉచిత ఇసుక విధానం ప్రారంభం కాలేదు. భీమవరం, నరసాపురం పట్టణాలకు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం తూర్పుగోదావరి జిల్లాలో మూడు ఇసుక కేంద్రాలు ఉన్నాయని ఇవి ఐదు మండలాలకు అతి సమీపంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలంలోని పెండ్యాల, ఉసులుమర్రులో ఇసుక అందుబాటులో ఉందని అక్కడ నుంచి తెప్పుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కోనసీమ జిల్లాలో మూడు ఇసుక పాయింట్లు మరో ఐదు మండలాలకు దగ్గరగా ఉన్నాయని, రావులపాలెం మండలంలో రావులపాడు -1, 2, కొత్తపేట కేంద్రంలోనూ ఇసుక అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకం ఇసుక సరఫరాకు పక్క జిల్లాలపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా డిపోల్లో నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేసి రవాణా చేసుకుంటే గతానికీ, ఇప్పటికీ పెద్దగా తేడా ఉండదన్న అభిప్రాయం అక్కడి ప్రజల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో ఉచిత ఇసుక విధానం జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి - జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం – 1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ, పోలీస్, అధికారులు సమన్వయంతో పనిచేసి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పూర్తిస్థాయి అమలుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పిసి పిఎన్ డిటి చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలను ఎజెండా ప్రతిపాదన సమన్వయంతో సంబంధిత అధికారులు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లలో అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. స్కానింగ్ ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. మరీ ముఖ్యంగా మెడికల్ షాపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల ప్రకారం మందుల విక్రయం నిర్వహణ చేయడంతున్నదీ లేనిదీ (డ్రగ్) అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో డాక్టర్ సలహా మేరకే మందులు వేసుకోవాలే తప్ప షాపుల్లో మందులు కొని వేసుకోవడం వల్ల వచ్చే అనర్థాలపై సంబంధిత అధికారులు అవగాహన కార్యక్రమంలో వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా గత కమిటీ సమావేశంలో ఆమోదించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పి స్వరూపరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.శర్మిష్ట, డిఐఒ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ పిడి కె.పద్మావతి, డిసిపిఒ సూర్య చక్రవేణి, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - పోలవరం

కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. ప్రాజెక్టులోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.580 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.610 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకి ఎగువన 26.650 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకి దిగువన 15.490 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లిఖార్జునరావు తెలిపారు.

6.018 వేల క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6.018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలనుపోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు మంగళవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.802 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకూ 2.4060 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.


స్పిల్ వే వద్ద పెరుగుతున్న గోదావరి నిటీమట్టం

కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి సకాలంలో ఎండిటి చికిత్స అందించేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని సంబంధిత వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం గౌతమీ సమావేశ మందిరంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం, వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యాధి వ్యాప్తికి కారణాలను గుర్తించి, నివారించాలని సూచించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ జిల్లాలో ఇంటింటా సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అవగాహన ద్వారా వ్యాధిని చాలా వరకు అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థినీ తనిఖీ చేసి, స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే గుర్తించాలన్నారు. జిల్లా ఆసుపత్రులు కూడా తమవద్దకు వచ్చే రోగుల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సర్వే కోసం ఇంటివద్దకు వచ్చే ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు.


కలెక్టర్ వెట్రిసెల్వి

క్షయ నివారణకు కృషి చేయాలి

సమాజంలో క్షయ నివారణకు అందరూ కృషి చేయడంతోపాటు వ్యాధి పట్ల అందరిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సూచించారు. వ్యాధిసోకిన వారికి ఆరు నెలలపాటు తప్పనిసరిగా మందులు వాడేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. క్షయతో బాధపడుతున్న వారికి ప్రభుత్వపరంగా కల్పిస్తున్న సదుపాయాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్. శర్మిష్ట, జిల్లా కుష్టు, టిబి నివారణాధికారి కె.సత్యనారాయణ, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు సిసిఆర్‌సి కార్డులు కలిగి ఉండాలి

ఆర్‌డిఒ అద్దయ్య

ప్రజాశక్తి - పోలవరం

రైతులు విధిగా పంట సాగుదారుల హక్కు పత్రాలు (సిసిఆర్‌సి కార్డులు) కలిగి ఉండాలని ఆర్‌డిఒ అద్దయ్య సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ, రైతు సేవా కేంద్రం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడారు. సాగుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతులు గ్రామ రెవెన్యూ పరిధిలో విఆర్‌ఒలు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి సాగు వివరాలు తెలిపి సాగుదారుల హక్కు పత్రాలు పొందాలని సూచించారు. ఈ కార్డు 11 నెలల కాలపరిమితి కలిగి ఉంటుందని, ఈ కార్డు వల్ల అసలైన భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని తెలిపారు. సాగు హక్కుపత్రం పొందిన రైతులకు పంటపైనే హక్కు ఉంటుందని, పండించే పంటలకు మద్దతు ధర, పంట రుణం, పెట్టుబడి రాయితీ, ఇన్సూరెన్సు ప్రభుత్వ పథకాలు నేరుగా సాగుదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో సమీప రైతు కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహించి సాగుదారులను గుర్తించి హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సాగు రైతులు హక్కు పత్రాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జివి.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, రెవెన్యూ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ అద్దయ్య

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలి

ఎంఎల్ఎ బాలరాజుకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని కోరారు. ఈ మేరకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని, పనిభారం పెరిగిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, 42 రోజుల సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీలో ఉన్న అన్ని అంశాలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కరించేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి మడవి దుర్గారావు, జీలుగుమిల్లి మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు, కుక్కునూరు ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.లత, అంగన్వాడీలు పాముల అన్నపూర్ణ, వర్స మంగ, సున్నం పార్వతి, బాడిస సుజాత, ఎస్.లక్ష్మి, మణి, జన్మకుమారి, సుమిత్రా పాల్గొన్నారు.


ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

కలెక్టర్ చొరవతో మూడేళ్ల తర్వాత కన్నతల్లి ఒడికి బాలుడు

ప్రజాశక్తి - ఏలూరు

పశ్చిమ బెంగాల్ హౌరాకి చెందిన డిసిపియు, పోలీస్, ఐసిడిఎస్, సిడబ్ల్యూసి సిబ్బంది కృషితో మూడేళ్ల తర్వాత ఓ బాలుడు తన కన్న తల్లి వద్దకు తిరిగి చేరిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. బుట్టాయగూడెం మండలానికి చెందిన 12 ఏళ్ల బాలుడు అలిగి 2021లో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అయితే కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయినా తల్లి ఎవరికీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఎవరైనా అడిగినా బంధువుల ఇంటికి వెళ్లాడని చెప్పేది. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ బాలుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా రైల్వే స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఒంటరిగా, అనుమానితుడిగా ఉన్న బాలుడిని గమనించిన రైల్వే శాఖ పోలీస్ సిబ్బంది బాలుడిని చేరదీసి హౌరాలోని స్థానిక ఐటిఇండియా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అనే చైల్డ్ కేర్ సంస్థలో బాలుడిని జాయిన్ చేశారు. అనంతరం ఇటీవల హౌరాలోని డిసిపియు, సిడబ్ల్యూసి అధికారులు ఘర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తూ ఉండగా అతడు ఇచ్చిన అస్పష్టమైన సమాచారంతో బాలుడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా అని ప్రాథమికంగా గుర్తించిన హౌరా అధికారుల బృందం ఏలూరు జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణిని ఫోన్‌లో సంప్రదించి బాలుడి వివరాలు తెలుసుకునేలా వీడియో కాల్ ఏర్పాటు చేశారు. బాలుడితో మాట్లాడిన ఏలూరు జిల్లా డిసిపిఒ అతని తల్లిదండ్రుల పేర్లు, గ్రామం వంటి వివరాలు ఏమన్నా కొన్ని గుర్తు చేసుకోమని కోరగా తాను కెఆర్.పురం పరిధిలోని కోయ గిరిజన తరగతికి చెందిన వాడినని బాలుడు తెలిపారు. దీంతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాలతో జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పద్మావతి పర్యవేక్షణలో జిల్లా డిసిపిఒ సూర్య చక్రవేణి ఆధ్వర్యంలో బాలుడి ఫొటోతో ఏలూరు జిల్లాలోని ఐసిడిఎస్, సిడిపిఒల సిబ్బంది సమన్వయంతో పలు గిరిజన హాస్టళ్ల సహా పలు గ్రామాల్లో విచారణ చేపట్టారు. చివరకు బుట్టాయగూడెంలో బాలుడి తల్లిని గుర్తించారు. అనంతరం బుట్టయగూడెం చేరుకున్న సిబ్బంది బాలుడి తల్లి, కుమారుడితో గ్రూప్ విడియో కాల్ ఏర్పాటు చేశారు. దీంతో బాలుడు తల్లిని గుర్తించడంతో ఆ బాలుడిని ఏలూరు జిల్లా పంపేందుకు అవసరమైన పత్రాలు సమర్పించాలని హౌరా పోలీసు అధికారులు కోరగా సంబంధిత వివరాలను పంపారు. దీంతో బాలుడిని ఏలూరు జిల్లాకు పంపించేలా అనుమతి ఇస్తూ హౌరా బాలల సంరక్షణ సమితి వారు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జులై ఎనిమిదో తేదీ సోమవారం ఉదయం సంబంధిత అధికారుల పర్యవేక్షణలో బాలుడిని రైలు ప్రయాణం ద్వారా సిబ్బంది ఏలూరు తీసుకొచ్చి శనివారపుపేటలోని జిల్లా బాలల సంరక్షణ సమితి ముందు హాజరు పరిచారు. అనంతరం మంగళవారం ఉదయం కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమక్షంలో బాలుడిని అతని తల్లికి క్షేమంగా అప్పగించారు. స్థానిక అంగన్వాడీ వారి ద్వారా ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేసుకుని ఏదైనా వృత్తి విద్యా కోర్సులు ఆ బాలుడికి నేర్పించాలని డిపిపిఒను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సుదీర్ఘ కాలంగా దూరమైన కుమారుడు అధికారుల కృషి వల్ల తిరిగి తన వద్దకు చేరటంతో ఆ తల్లి ఎంతో సంతోషపడింది. ఈ సందర్భంగా బాలుడి వివరాలు గుర్తించి క్షేమంగా తల్లికి అందించిన ఏలూరు జిల్లా డిసిపిఒ, ఐసిడిఎస్ సిబ్బందిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిసిపిఒ సిహెచ్.సూర్యచక్రవేణి, బుట్టాయగూడెం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, డిసిపియు ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం సిపిఎం మండల కమిటీ సమావేశం కొరసా జలపాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ వర్షాలు మొదలవ్వడంతో విష జ్వరాలు అన్ని గ్రామాల్లో విస్తరిస్తున్నాయని, జ్వరాలను నియంత్రించడానికి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. అన్ని హాస్పిటల్లోని మలేరియా, టైఫాయిడ్ వంటి టెస్ట్‌లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో జ్వరాలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి జ్వరాల నియంత్రకు చర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

మండల కేంద్రంగా ఉన్న జూనియర్ కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న హాస్టళ్లకు అదనపు భవనాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టల్ సౌకర్యం ఉండడంతో విద్యార్థులు కళాశాలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నప్పటికీ విద్యార్థులకు తగినంతగా భవనాలు లేకపోవడం చాలా బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అదనపు భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, నాగమణి, వీరయ్య, రాజు, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, నరేంద్ర పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు, సిడిపిఒలు బాలల హక్కులు, చట్టాల పైన అవగాహన పెంచుకుని బాలలకు అవసరమైన రక్షణ, సంరక్షణ అందించే విధంగా పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఏలూరు మండలంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న గోదావరి సమావేశ మందిరంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ వారి ఆధ్వర్యంలో జిల్లా ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో బాలలకు అవసరమైన రక్షణ, సంరక్షణ, బాలలను బాలల సంక్షేమ సమితి వారి దగ్గరికి ఎలా పంపించాలనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జువైనల్ జస్టిట్ ఆక్ట్ ప్రకారం రక్షణ, సంరక్షణ కావాల్సిన బాలలను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (బాలల రక్షణ సమితి) ముందు తప్పనిసరిగా హాజరు పరిచి, బాలలకు అవసరమైన రక్షణ సంరక్షణ, పునరావాసం, వసతి, విద్యను కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. బాలల చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు కార్యక్రమాలను క్రాఫ్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెఎవిఎల్.పద్మావతి మాట్లాడుతూ క్రాఫ్ వారు నిర్వహించిన ఈ అవగాహనా సదస్సు ద్వారా రక్షణ యంత్రాంగాలు ఎలా పని చేయాలో, గ్రామ స్థాయి నుంచి అంగన్వాడి కార్యకర్తలు రక్షణ, సంరక్షణకు అవసరమైన బాలలకు ఏ విధమైన సహాయ సహకారాన్ని అందించాలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు బాలల హక్కులు రక్షణ చట్టాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేస్తూ బాలల రక్షణ, సంరక్షణకు అందరూ సహకరించాలని సూచించారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 18 ఏళ్ల లోపు బాల బాలికలు సంరక్షణ, రక్షణకు అవసరమైన బాలలను అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు గుర్తించి వారి సమాచారాన్ని క్రాఫ్ సిబ్బందికి తెలియజేసి బాలలను ఆదుకునే విధంగా సహకారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ కె.హైమావతి, భీమడోలు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ కెవిఎఎస్.విజయలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ పి.వెంకటేశ్వరరావు, సిహెచ్.రాజేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆర్.రాజేష్, అడిషనల్ సిడిపిఒ ఎంఎస్.రాజశేఖర్, ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.సూరి చక్రవేణి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, పోలీసు సిబ్బంది, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలపై తనిఖీలు చేపట్టాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రత చర్యలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరిశ్రమలు, కార్మిక, కాలుష్య నియంత్రణ, ఫ్యాక్టరీస్ తదితర శాఖల అధికారులతో జిల్లా పరిశ్రమల భద్రత కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అన్ని పరిశ్రమల్లో భద్రత పటిష్టం చేయాల్సి ఉందన్నారు. తరచూ మాక్ డ్రిల్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కార్మికులు, ప్రజల్లో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసరమైన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో రక్షణ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్, కచ్చితంగా పాటించాలన్నారు. పరిశ్రమల లోపలే కాకుండా పరిశ్రమల చుట్టు పక్కల ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరింత భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నూతనంగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించల్సిన భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాలుష్య నియంత్రణకు చేపట్టాల్సిన పలు అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, ఎపిఐఐసి జెడ్ఎం కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ వి.ఆదిశేషు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొత్తగా వివిధ కోర్టుల్లో న్యాయమూర్తులుగా నియమితులైన పి.వి.నాగరంజితకుమార్ (తణుకు), కాశస్తి రాజారాజేశ్వరి తేజస్వి (జంగారెడ్డిగూడెం), వివిఎస్.లక్ష్మీలావణ్య (పాలకొల్లు), బండి రచన (ఏలూరు) మంగళవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రెవెన్యూ అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో న్యాయమూర్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై గొయ్యి పూడ్చివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రులో రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోకుండా సర్పంచి పొట్లూరి ఉమామహేశ్వరరావు చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై వర్షపు నీటితో అవస్థలు శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రోడ్డుపై గొయ్యిని గ్రావెల్‌తో పూడ్చించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా మానసిక ఆందోళన లేకుండా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి తెలిపారు. ముసునూరు మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు.

విద్యార్థుల కోసం బస్సు ప్రారంభం

ముసునూరు : గుళ్లపూడి, వలసపల్లి గ్రామాల నుంచి గుడిపాడు జెడ్‌పి హైస్కూల్‌కి విద్యార్థులు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ టిడిపి నాయకులు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి పార్థసారథి తక్షణమే డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి విద్యార్థులకు, గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా బస్సు సౌకర్యం కల్పించాలని చెప్పారు. మంగళవారం బస్సును ప్రారంభించడంతో వలసపల్లి, గుళ్లపూడి, గుడిపాడు విద్యార్థులు వారి తల్లిదండ్రులు మంత్రి కొలుసు పార్థసారథికి ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

స్థానిక జంగారెడ్డిగూడెం నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై మంగళవారం అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ పి.రాజేష్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన మొక్కలను ప్రతి షాపులో పంచుతూ వాటిని నాటి పోషించి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక మసీదు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి పర్యావరణాన్ని, మట్టిని, వాతావరణాన్ని రక్షించడమే భవిష్యత్ తరాలకు ప్రధాన కర్తవ్యమని నినాదాలు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ వి.లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడారు.

10న దేశ వ్యాప్త ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాల కార్మిక వర్గ వ్యతిరేక నిర్ణయాలపై ఈ నెల పదో తేదీన దేశవ్యాప్తంగా సిఐటియు కార్మిక సంఘాలు తలపెట్టిన ధర్నాలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండలాధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సిఐటియు ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ కార్మిక చట్టాలు మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి అమలు చేయడానికి వ్యతిరేకంగా కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని తదితర డిమాండ్లతో జరిగే ఈ ధర్నా జయప్రదం చేయాలని కోరారు.

వైసిపి పాలనలో సమస్యలతో ప్రజలు సతమతం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గత ఐదేళ్ల వైసిపి పాలనలో సమస్యలతోనే ప్రజలు సహజీవనం చేశారని, టిడిపి కూటమి ప్రభుత్వ రాకతో ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెరిగిందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పలు సంస్థల ప్రతినిధులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు.

కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలి

కైకలూరు ఎంఎల్ఎ శ్రీనివాస్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - కైకలూరు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఫలాలు అందేలా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌ను కలిసి కార్మికుల సమస్యలను చర్చించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది కార్మికులు ఉన్నారని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత సంక్షేమ బోర్డు చట్టాల అమలు చేయకుండా 12 14 మెమో ఇచ్చారని జిల్లా ప్రధాన కార్యదర్శి నార్పల రమణారావు అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల చట్టం అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, 12 14 మెమోను ఎత్తివేసి సంక్షేమ బోర్డును పునర్దించాలని, భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు ద్వారాగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎంఎల్ఎ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. జిల్లా కమిటీ సభ్యులు పరస రాజేష్, అబ్దుల్ అక్బర్ అక్బర్ బాషా, నాగిరెడ్డి శ్యామలరావు, బత్తిన సూరిబాబు, కటికలు శ్రీనివాస్, బండారు కనక లింగేశ్వరరావు, పాత కోట శివశంకర్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోటలో ఈ నెల మూడో తేదీన సరిహద్దు, ఇంట్లో వాడిన మురుగనీరు దారిలోకి వస్తున్నాయన్న విషయమై గ్రామానికి చెందిన పరసా బాలాజీ, దేవి దంపతులకు, తుమ్మ సురేష్, అనిత దంపతులకు మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఈ గొడవలో సురేష్ కత్తితో, భార్య అనిత చాకుతో పరసా బాలాజీ, దేవి దంపతులపై దాడి చేయడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సురేష్ హాస్పిటల్‌లో దేవి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల ఐదో తేదీన మరణించింది. కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ ఈ హత్య కేసులో నిందితులైన తుమ్మ సురేష్ అతని భార్య అనితలను మంగళవారం చిగురుకోటలోని ఇంటి వద్ద అరెస్టు చేసి కైకలూరు కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి ఎం.శివకిరణ్ 14 రోజుల రిమాండ్ విధించారు.

కుమారుడు కన్పించడంలేదని తండ్రి ఫిర్యాదు

ముసునూరు : తన కుమారుడు పర్వతనేని రామకృష్ణ కనిపించడంలేదని ఓ తండ్రి ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పర్వతనేని గోవర్ధన్‌కు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో మధ్య కుమారుడైన పర్వతనేని రామకృష్ణ ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఇతనికి మతిస్థిమితం లేని ఆలోచనలతో బయటికు వెళ్లిపోయాడని తండ్రి తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా : ట్రాక్టర్ స్వాధీనం

ముసునూరు : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వలసపల్లి గ్రామంలోని తమ్మిలేరు నుంచి మంగళవారం ఉదయం ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

10న కోటేశ్వరరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు తమ్మ చిట్టి కోటేశ్వరరావు సంస్మరణ సభ ఈ నెల పదో తేదీ బుధవారం ఉదయం పది గంటలకు ఆయన స్వగ్రామం దగ్గులూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు తెలిపారు. చేనేత, కార్మిక, ఉద్యమ, శ్రేయోభిలాషులు, మిత్రులు, వారి సన్నిహితులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తమ్మచిట్టి కోటేశ్వరరావు తన వృత్తిని చేసుకుంటూ సొంత లాభం కొంతమానుకో పొరుగువారికి తోడుపడఓయ్ అని గురజాడ బాటలో నడిచి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. చేనేత కార్మిక సంఘం కార్యక్రమాలకు ప్రజాతంత్ర ఉద్యమానికి ఎనలేని కృషి చేశారని వారు తెలిపారు. చేనేత కార్మిక సంఘం ప్రజాతంత్ర ఉద్యమ కార్యక్రమాలకు ఎప్పుడు పిలుపు ఇచ్చినా ఉత్సాహంగా ఆయా కార్యక్రమంలో పాల్గొని తోటి కార్యకర్తలకు మరింత ఉత్సాహాన్ని కల్పించేవారని తెలిపారు.

వృద్ధ కళాకారులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను రంగస్థలం కళాకారులకు కూడా వర్తింపచేసి పేద వృద్ధ కళాకారులను ఆదుకోవాలని ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, తెలుగు నాటక రంగ సంస్థ కళాకారులు తిరుపతి రమేష్ బాబు బుధవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో వందలాది మంది కళాకారులు వివిధ రూపాల్లో కళలను ప్రదర్శించి వృద్ధాప్యంలో ఆకలితో అనారోగ్యంతో మంచానికి పరిమితమైన నిరుపేద వృద్ధ కళాకారులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. జులై నుంచి పెంచిన రూ.వెయ్యితో కలిపి ఇస్తున్న రూ.నాలుగు పెన్షన్ వృద్ధ కళాకారులకు వైద్య ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. ఈ దశలో ప్రభుత్వం తప్ప తమను ఆదుకునే వారు ఎవరూ లేరని, నిరుపేద వృద్ధ కళాకారులందరికీ నెలకు రూ.ఆరు వేలు పెన్షన్ ఇచ్చి పేద కళాకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల రూరల్

మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో విద్యార్థులకు ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు కిట్లు అందించారు. ద్వారకాతిరుమల మండలం పర్యటనలో భాగంగా పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు పాల్గొన్నారు.

రైతులు మట్టి నమూనా సేకరణకు సహకరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఎంపిక చేసిన వ్యవసాయ భూముల్లో మట్టి నమూనా సేకరణకు రైతులు సహకరించాలని మండల వ్యవసాయాధికారి బి.సుమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 560 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటికీ రూ.389 నమూనాలు సేకరించినట్లు ఆమె తెలిపారు. మిగిలిన నమూనాలు రెండు రోజుల్లో పూర్తి చేసి గొల్లపూడిలో గల భూసార పరీక్షా కేంద్రానికి పంపనున్నట్లు ఆమె తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ద్విచక్రవాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేనాధికారి సంస్థ ఛైర్మన్ 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ తెలిపారు. హైకోర్టు వారి పిల్ నెంబర్ 116/24లో ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని నూజివీడులోని కోర్టు హాలులో హెల్మెట్ వాడకంపై చైతన్యం తెచ్చే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 15వ జిల్లా జడ్జి ఎ.నాగశైలజ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్ద కాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ కృష్ణమూర్తి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, సెకండ్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కలిదిండి : గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ 12 14 ఇచ్చిన మెమోను రద్దు చేసి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కమిటీ సమావేశం మండలాధ్యక్షులు పోతురాజు బాలాజీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నుంచి గత ప్రభుత్వం దారి మళ్లించిన రూ.మూడు వేల కోట్లను సంక్షేమ బోర్డుకు జమ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పరసా రాజేష్, అబ్దుల్ అక్బర్ బాషా, కటికల శ్రీనివాసరావు, బత్తిన సూరిబాబు, సానబోయిన సత్యనారాయణ, బండారు కనక లింగేశ్వరరావు, పుప్పాల చంటి, జాఫర్ వళి, నల్లారి వెంకటేశ్వరరావు, ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో కళాశాలల మధ్య విపరీతంగా పోటీ పెరిగి ప్రభుత్వ కళాశాలలు నిర్వీర్యమవుతున్న తరుణంలో ప్రయివేట్ కళాశాలలు పెరిగి ప్రభుత్వ కళాశాలకు విద్యార్థులు దూరమైపోతున్నారన్ని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుస్మా కౌముది, వారి టీచింగ్ స్టాఫ్, చింతలపూడి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌తో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, పోలీస్, టీచర్స్, ఇంకా ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలుగుతున్నారన్నారు. కళాశాల అధ్యాపకులు ఉదాసీనత వీడి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలన్నారు. కళాశాలలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

జీలుగుమిల్లి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సిహెచ్.కొండలరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీలో ఉన్న పలు అంశాలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిఐటియు కార్యదర్శి సిహెచ్.కొండలరావు, సాయి పాల్గొన్నారు.

సాగు, తాగునీరు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగు, తాగునీరు పంట కాలువలకు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సిపిఎం సీనియర్ నేత ఉల్లంకి నాంచారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దేవపూడిలో ఆయన మాట్లాడుతూ జులై రెండో వారమైనా నేటి వరకు పంట కాలువలకు సాగు, తాగు నీరు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. మండలంలో ఇప్పటికే అనేక గ్రామాల్లోని తాగునీటి చెరువులు అడుగంటాయన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగు, తాగు నీటిని కాలువలకు వెంటనే విడుదల చేయాలని కోరారు.

చింతలపూడిలో ఉచిత ఇసుక విధానం ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన నెలకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో పాత బస్టాండ్ వద్ద ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఇసుక దందా నడిచిందన్నారు. దాదాపుగా రూ.50 వేల కోట్లకు పైగా ఇసుక దందా జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన ఇసుక దందాతో రూ.పది లక్షలకు పైగా గృహాలను నిర్మించుకోవచ్చని, అంటే ఏ విధంగా ఇసుక దోపిడీ జరిగిం దో ప్రజలు గమనించాలని కోరారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిఒ నెంబర్ 43ని విడుదల చేశారన్నారు.

ఎంఎంసి ఛైర్మన్‌గా అవకాశమివ్వాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - కామవరపుకోట

చింతలపూడి ఎఎంసి ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు టిడిపి కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిలారు సత్యనారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవటానికి, ప్రజల్లోకి తీసుకెళ్లటానికి నియోజకవర్గ సీనియర్ నాయకుల సూచనల మేరకు కృషి చేశానన్నారు. టిడిపి నిర్దేశించిన అన్ని కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటూ పార్టీ విధేయుడిగా కట్టుబడి ఉన్నానని, దానికి పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారిచే ప్రశంసలు అందుకుని మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేశానని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యేలా సోషల్ మీడియాలో చైతన్య పరచడంతో పాటు మండలంలోని నాయకులకు, ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ టిడిపి విజయానికి కృషి చేసినట్లు చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జనసేన, బిజెపి నాయకులతో కలిసి తన ప్రయాణాన్ని ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా కొనసాగించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించాలని కోరుతూ ఎంఎల్ఎకు వినతిపత్రం అందించారు.



ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న కిలారు సత్యనారాయణ

సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ

ప్రజాశక్తి - భీమడోలు

సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారణకు కృషి చేద్దామని పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగీ, డయేరియా, మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, పుర ప్రముఖుల భాగస్వామ్యంతో గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచితో పాటు భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి మాట్లాడారు.

మురుగనీటి పారుదలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణల తొలగింపు

ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో పాటు స్థానికంగా నిల్వ ఉండే వరద నీరు జతకావడంతో గ్రామపంచాయతీ పరిధిలో ముంపు బెడద ఎక్కువగా ఉంది. దీని దృష్టిలో ఉంచుకున్న గ్రామపంచాయతీ సర్పంచి రహీమా బేగం హసేన, గ్రామ పంచాయతీ కార్యదర్శి జయ రామకృష్ణ, గ్రామపంచాయతీ పరిధిలోని భీమడోలు జంక్షన్‌లో ఉన్న ప్రధాన మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. మురుగనీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులకు మురుగు కాలువల ఆక్రమణలు వల్ల కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. ఆక్రమణల తొలగింపు వల్ల గ్రామానికి ముంపు బెడద తప్పిందని వారు తెలిపారు.

వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు వస్తాయని సిటిఆర్ఐ హెడ్ వై.సుబ్బయ్య తెలిపారు. పొగాకు పరిశోధన కేంద్రంలో వాణిజ్య పంటల సాగుపై రైతులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటలకు ఉత్తర ప్రాంత తేలిక నేలలు అనుకూలమైనవన్నారు. ఈ నేల స్వభావాన్ని బట్టి వివిధ రకాల వాణిజ్య పంటలను వేయడం వల్ల రైతులకు అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం ఉద్యానవన శాఖాధికారిణి నవీన మాట్లాడుతూ వాణిజ్య పంటలకు సంబంధించి ఎస్‌టి రైతులకు రాయితీపై పలు రకాల పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లో భాగంగా మండలంలోని పలువురు రైతులకు పసుపు విత్తనాలను అందించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి విద్యుత్ వినయోగదారులు తమ కరెంట్ బిల్లులను ఎపిసిపిడిసిఎల్ యాప్ ద్వారా గాని, డిస్కామ్ వెబ్‌సైట్‌లో గాని చెల్లించేప్పుడు మాత్రమే ఫోన్‌పే, గూగుల్ పే, పేటిఎం లేదా ఇతర యుపిఐ యాప్స్‌ను వాడవచ్చని నూజివీడు ఎపిసిపిడిసిఎల్ ఎడిఇ పోతురాజు తెలిపారు. ఆగిరిపల్లిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు ఎపిసిపిడిసిఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపుపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించటంతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఇ ప్రసాద్, ఆగిరిపల్లి ఎఇ రామారావు, ఎల్ఐ నాగేశ్వరరావు, లైన్‌మెన్ శోభన్‌బాబు, జెఎల్ఎం జనార్ధన్ పాల్గొన్నారు.

రైతు సేవ కేంద్రాల ఇన్‌ఛార్జులకు శిక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కొత్తగా పండ్ల తోటలు (మామిడి, నిమ్మ, కోకో, కొబ్బరి)ఆయిల్ పామ్, కూరగాయ మొక్కలు వేసుకునే రైతులు మీ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రాయితీ పొందడం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆగిరిపల్లి మండల ఉద్యానశాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక తెలిపారు. 2024-25వార్షిక ప్రణాళికలో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలపై ఆమె రైతు సేవ కేంద్రాల ఇన్‌ఛార్జులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కనసానపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ఉద్యానశాఖ ద్వారా అందించే పథకాలు, రాయితీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పేద మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిరుపేద మహిళ అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సాయం మంగళవారం అందించారు. మండలంలోని పెదకా మనపూడికి చెందిన భూపతి గోవిందమ్మ(35) నిరుపేదరాలు. చాలా కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మరణించింది. విషయం తెలుసుకున్న వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా అంత్యక్రియాల ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి - పోలవరం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల కేంద్రం వాలంటీర్లు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో, సచివాలయంలో మంగళవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా నిర్విరామంగా పనిచేశామని, కరోనా కష్టకాలంలో, వరదల సమయాల్లో కూడా ఎన్నో సేవలందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తమను విధుల్లో కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

మండవల్లి : పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అన్నారు. 2010 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మూడు ఫ్యాన్లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం వితరణగా అందించారు. అనంతరం సర్పంచి మెండ రూస్నీ చేతుల మీదుగా ఫ్యాన్లను ప్రధానోపాధ్యాయులకు అందించారు.